www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 22 నవంబరు 2022

5

ఏలూరు

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దుర్మరణం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడేనికి చెందిన తెల్లం రామకృష్ణ(51) నరసాపురంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఇంటికి వచ్చిన ఆదివారం కన్నాపురంలోని పోలవరం రోడ్‌లో ఉన్న పెట్రోల్‌బంక్‌లో తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించుకుని రోడ్డు ఎక్కుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామకృష్ణను రాజమండ్రి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎస్ఐ జిజె.విష్ణువర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశలు.. అడియాశలు

రూ.3300 వేల కోట్లు తప్ప ఇతర అంశాల ఊసే లేదు

వశిష్ట వారధి నిర్మాణానికి చర్యలు : ముఖ్యమంత్రి జగన్

లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటుకు సహకరించాలి : ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

సిపిఎం, ఫుడ్‌పార్కు ఉద్యమ నేతలపై విరుచుకుపడ్డ పోలీసులు

పలుచోట్ల బిజెపి నేతల గృహనిర్బంధం



అగ్రికల్చర్ కంపెనీ భూముల పత్రాలను రైతులకు అందిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - భీమవరం, నరసాపురం టౌన్

భీమవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాడ్డక ముఖ్యమంత్రి జగన్ తొలిసారి నరసపాపురం పర్యటనకు విచ్చేశారు. ఈ పర్యటనపై జిల్లా ప్రజానీకం పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలుగానే మిగిలిపోయాయి. ముఖ్యమంత్రి పర్యటన నరసాపురం నియోజకవర్గానికే పరిమితమైంది. కనీసం నూతన జిల్లా అభివృద్ధికి ఎటువంటి ప్రకటనా సిఎం చేయకపోవడంపై జనంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

నరసాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్ సోమవారం పర్యటించారు. ఆయన హెలీకాప్టర్‌లో ఉదయం 11.04 నిమిషాలకు నరసాపురం మండలం చినమామిడిపల్లిలోని హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, హోం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా, చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, కలెక్టర్ ప్రశాంతితోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు సిఎంకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో జగన్ దారి పొడవునా అభివాదం చేసుకుంటూ రుస్తుంబాదలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి 11.54 నిమిషాలకు చేరుకున్నారు. అక్కడి నుంచి రూ.4.80 కోట్లతో నిర్మించిన బస్సు కాంప్లెక్స్, రూ.11 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని బటన్ నొక్కి ప్రారంభించారు. రూ.332 కోట్లతో నిర్మించనున్న ఆక్వా యూనివర్శిటీ, రూ.429 కోట్లతో నిర్మించనున్న బియ్యపుతిప్ప ఫిషింగ్ హర్బర్, రూ.1400 కోట్లతో నిర్మించనున్న వాటర్ గ్రిడ్‌తోపాటు మొత్తం రూ.3300 కోట్లతో చేపట్టిన పలు అభివీద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. 12.37 నిమిషాలకు వేదికపైకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ ముందుగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవ సభలో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభోపన్యాసం చేశారు. సుస్థిర అభివృద్ధి, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగ కల్పనకు రూ.3300 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. ఆక్వా యూనివర్శిటీ, ఫిషింగ్ హర్బర్, వాటర్ గ్రిడ్ వంటివి నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా బస్సు కాంప్లెక్స్ ఆధునీకరణ, వంద పడకల ఆసుపత్రి నిర్మించుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు, ముఖ్యమంత్రి జగన్ సభలో మాట్లాడుతూ కలెక్టర్ ప్రస్తావించిన అంశాలనే పదేపదే ప్రస్తావించారు. 36 నిమిషాలపాటు ప్రసంగించిన జగన్ సమయం అంతా నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి, శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసమే మాట్లాడారు. చివరి పది నిమిషాలు టిడిపి, జనసేనపై చేసిన ఘాటైన వ్యాఖ్యలతో సభికుల్లో కదలిక వచ్చింది. అయితే ముఖ్యమంత్రి పర్యటన కొత్త కేంద్రంతోపాటు జిల్లా సమగ్రభివృద్ధికి దోహదపడుతుందని అంతా ఆశించినప్పటికీ దానికి అవకాశం లేకుండాపోయింది.

వశిష్ట వారధిపై వంతెన నిర్మాణానికి చర్యలు : సిఎం జగన్

ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న వశిష్ట వారిధిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులకు టెండర్లు పిలుస్తామన్నారు. పట్టణంలో రూ.13 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని జాతికి అంకితం చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఆక్వా విశ్వ విద్యాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. దేశంలో తమిళనాడు, కేరళ మినహా ఎక్కడా ఆక్వా యూనివర్శిటీలు లేవన్నారు. ఆక్వా సాగు వల్ల తాగు నీరు కలుషితమైందని, పూర్వపు పశ్చిమ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు రూ.1400 కోట్లతో వాటర్ గ్రిడ్ నిర్మించనున్నామన్నారు. ముఖ్యంగా మత్స్యకారుల కోసం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హర్బర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్రికల్చర్ కంపెనీ భూముల లీజును రద్దు చేస్తున్నామని చెప్పారు. సుమారు 1754 ఎకరాలకు సంబంధించి 1623 మంది రైతులకు పూర్తి హక్కును కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని కొలమానంగా తీసుకొని రాబోయే రోజుల్లో వైసిపికి అండగా నిలవాలని కోరారు.

లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటుకు సహకరించాలి : ప్రభుత్వ విప్ ప్రసాదరాజు

అభివృద్ధిలో వందేళ్లు వెనక్కి ఉన్న నరసాపురం నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి జగన్ రాకతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బహిరంగ సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లాల పునర్విభజనలో జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరానని, అయితే రాష్ట్ర అభివృద్ధి వికేంద్రీకరణలో తన వెంట ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారని గుర్తు చేశారు. నాడు మాటిచ్చిన ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధికి రూ.3300 కోట్లు నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని, లింకు రోడ్లు, శ్మశానవాటికల ఏర్పాటు వంటి వాటికి సహకరించాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం ముమ్మిడివరం ఒఎన్‌జిసి పైపులైన్ ఏర్పాటులో బాధిత 23450 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.107.90 కోట్లు వారి ఖాతాలకు జమ చేశారు. దీనికి సంబంధించిన నమూనా చెక్కును బాధితులకు అందించారు. అలాగే అగ్రికల్చర్ కంపెనీ భూముల రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. మత్స్యకారుల సంప్రదాయ వస్తువులైన వలకట్టు, చేతిబుట్ట, చేప నమూనా బొమ్మను ముఖ్యమంత్రి జగన్‌కు అందించి ఘనంగా సత్కరించారు.

జిల్లావ్యాప్తంగా బిజెపి నాయకుల అరెస్టు

జగన్ పర్యటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బిజెపి నాయకులను ఒకరోజు ముందుగానే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భీమవరం, పాలకొల్లు, నరసాపురం వంటి ప్రధాన ప్రాంతాల్లో బిజెపి ముఖ్య నాయకులను అరెస్టు చేశారు. దీనిపై బిజెపి తీవ్ర విమర్శలుచేసింది. సమాజంలో నిరసన తెలుపుకునే హక్కు అందిరకీ ఉంటుందని, వైసిపి ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసేలా ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు.

మత్స్యకారుల అభ్యున్నతికి జగన్ కృషి

రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు

మత్స్యకారుల అభ్యున్నతికి సిఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రధానంగా రూ.10 వేల ఆర్థిక సాయం, రూ.తొమ్మిది డీజిల్‌పై రాయితీ, ప్రమాదవశాత్తూ మత్స్యకారులు చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నెల్లూరు, బాపట్ల, కృష్ణా, కాకినాడ జిల్లాల్లో ఫిషింగ్ హర్బర్ల పనులు జరుగుతున్నాయని, తాజాగా బియ్యపుతిప్పలో ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు.

అడుగడుగునా ఆంక్షలు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నరసాపురం పట్టణమంతా అడుగడుగునా ఆంక్షలు విధించారు. రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో స్థానికంగా నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాలకొల్లు బైపాస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బహిరం గ సభా ప్రాంగణం పట్టణానికి దూరంగా ఉండడంతో జనాలను కష్టాలు వెంటాడాయి. ముఖ్యంగా సభా వేదిక వద్ద మీడియాపైనా తీవ్ర ఆంక్షలు విధించారు. ఎటువంటి ఫొటోలు తీయకూడదని నిబంధన విధించడం గమనార్హం.

వాయు'గండం'

పంట కాపాడుకునేందుకు రైతన్న ఉరుకులుపరుగులు

ప్రజాశక్తి - ముదినేపలి

వాతావరణ మార్పులతో రైతులు వణికిపోతున్నారు. అల్పపీడనం కాస్త వాయుగుండంగా మారడంతో వరి రైతులు కలవరపడుతున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడటంతో రైతులు బెంబేలెత్తారు. మండలవ్యాప్తంగా పంట చేతికి వచ్చి రైతులు రేపోమారో కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు వచ్చి వాయుగుండగా మారడంతో రైతులు పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పంటపై లక్షలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టామని రైతులు వాపోతున్నారు. ప్రతిఏటా నవంబర్‌లో పంటలు చేతికందే దశలో తుపాన్లు వచ్చి పంటను తుడిసిపెట్టుకుపోతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో స్వర్ణ వరి వంగడం కోతలు కోసి పనలపై ఉంది. మరికొన్ని గ్రామాల్లో పంట కోతకు సిద్దంగా ఉంది. ఈ దశలో పంటను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఈ తరుణంలో వర్షం పడితే పనపై ఉన్న పంట తడిసి రంగుమారి మొలకొతే ప్రమాదం ఉంటుందని హైరానా పడుతున్నారు. ఈదురు గాలులకు పైరు నేలవాలి కంకులు తడిసిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకునే పన్నుల్లో మండల రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

ముగిసిన సిఐటియు జిల్లా మహాసభ

జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా లింగరాజు, ప్రసాద్ ఎన్నిక

ఆర్.లింగరాజు

డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతామని పలువురు నేతలు ఉద్ఘాటించారు. సిఐటియు జిల్లా 12వ మహాసభ ఆఖరి రోజు సోమవారం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శిగా డిఎన్‌విడి.ప్రసాద్ ఎన్నికయ్యారు. వీరితోపాటుగా మరో 16 మందితో ఆఫీస్ బేరర్స్, 61 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లింగరాజు, ప్రసాద్ మాట్లాడుతూ ఏలూరులో నిర్వహించిన సిఐటియు జిల్లా మహాసభ మూడు రోజులు పాటు జయప్రదంగా ముగిశాయని తెలిపారు. ఈ మహాసభకు అనేక రూపాల్లో సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా మహాసభ స్ఫూర్తితో రానున్న కాలంలో జిల్లాలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు రూపొందిస్తామని చెప్పారు. అలాగే కోశాధికారిగా ఐవి.సుధాకర్, ఆఫీస్ బేరర్స్‌గా బి.సోమయ్య, పి.భారతి, కె.విజయలక్ష్మి, ఎన్.రమణరావు, ఎస్.రాంబాబు, అర్‌విఎస్.నారాయణ, కెవిఎన్ఎస్.ప్రసాద్, జి.రాజు, ఎం.నాగమణి, ఎం.దుర్గారావు, వివివిఎన్.ప్రసాద్, కె.వెంకట్రావు, కె.సుభాషిణి, వి.సాయిబాబు, సాయి కిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు.

తీర్మానాలు ఇవే..

- -రవాణా రంగంలో కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి.
- -జిఒ 21ను రద్దు చేయాలి.
- -స్థానికంగా ఆటో స్టాండ్‌లు కేటాయించాలి.
- -స్కీం వర్కర్లుకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- -రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి.
- -హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి.
- -ఏలూరు జ్యూట్ మిల్ తెరిపించాలి. లేని పక్షంలో కార్మికుల చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇప్పించాలి.
- -మునిసిపల్, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.
- -భవన నిర్మాణరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి. వెల్ఫేర్ బోర్డు నిధులు విడుదల చేయాలి. క్లెయిములు పరిష్కరించాలి.
- -ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. వారికి కనీస వేతనం ఇవ్వాలి.
- -సిపిఎస్ విధానం రద్దు చేయాలి.

మత్స్యకారుల సంక్షేమానికి చేయూత

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పలువురు మత్స్యకార సహకార సంఘాల ప్రతినిధులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వైఎస్ఆర్ మత్స్యభరోసా కింద మూడు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మత్స్యకారుల ఆర్థిక, జీవనస్థితిగతులు పూర్తిగా మెరుగుపడే చర్యలను ప్రభుత్వం తీసుకుందన్నారు. జిల్లాలో 239 మత్స్యకార సహకారాలున్నాయని, వాటిలో సుమారు 21,678 మంది సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏలూరు, కొవ్వలి బాదంపూడిలో చేపపిల్లల ఉత్పత్తి చేస్తామన్నారు. ప్రస్తుత సంవత్సరంలో బాదంపూడి ప్రభుత్వ మత్స్యక్షేత్రంలో 5.15 కోట్ల చేప నారు, 23.30 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేశారన్నారు. మత్స్యశాఖ ద్వారా పిఎం మత్స్యసంపద యోజన ద్వారా మత్స్యకారులకు పలు పథకాలు అమలు చేయబడుతు న్నాయన్నారు. ఆక్వారంగం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఆక్వారైతులకు విద్యుత్ సుంకం రాయితీ కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రాజేష్, భీమడోలు మండలం సాయన్నపాలెం మత్స్యకార సహకార సంఘం ప్రసిడెంట్ అమృతరాజు, దెందులూరు మండలం కొవ్వలికి చెందిన జ్యోతి, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు కె.దావీదు, నిడమర్రు మండలం తోకలపూడి వడ్డీ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు సైదు నాగరాజు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు న్యాయమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

190 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

స్పందనలో ప్రజల నుంచి అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 190 మంది అర్జీలు సమర్పించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎవివి.సత్యనారాయణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు అర్జీల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధపెట్టి పారదర్శకంగా పరిష్కరించేలా చూడాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించాల న్నారు. ఏ ఒక్క అర్జీకూడా రీ ఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరిం పబడాలన్నారు. రీ ఓపెన్ అర్జీలపై కూడా కిందిస్థాయి సిబ్బంది ఏ విధంగా చేస్తున్నారో సంబంధిత అధికారులు తప్పనిసరిగా చూడాలన్నారు. స్పందన ద్వారా ప్రజల నుండి అందిన విజ్ఞప్తుల్లో కొన్ని..

మండవల్లి మండలం మండవల్లికి చెందిన వీరపనేని మునలయ్య అర్జీనిస్తూ జాతీయ రహదారి భూసేకరణ విస్తీర్ణంలో భాగంగా ఇల్లు కోల్పోయిన నష్టపరిహారాన్ని చెల్లించడంలో జరిగిన రేటు, కొలతల తేడాకు సంబంధించి వ్యత్యా సాలను సవరించి తనకు కావాల్సిన పరిహారాన్ని చెల్లిం చేందుకు చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ విషయంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంగారెడ్డి గూడెం మండలం పేరంపేట పంచాయతీ వెంకట రామానుజపురానికి చెందిన దూరేపల్లి శ్రీను అర్జీనిస్తూ తిరుమలాపురంలో తమకు 2.45 సెంట్లు భూమి ఉందని అయితే పాస్ పుస్తకంలో 2.05 సెంట్లు మాత్రమే ఉందని పేర్కొన్నారన్నారు. దీన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగపాలెం మండలం కె.గోకవరం పచ్చనగరానికి చెందిన కె.సత్యవారాయణ అర్జీనిస్తూ తనకు చెందిన పొలాన్ని తన కూమారునికి ఇచ్చానని, అయితే ఆ పొలం వేరే వారిపేరుమీద ఆన్ లైన్ అయిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ తక్షణం పొలాన్ని వ్యక్తిగతంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కామవరపుకోట తహశీల్దారును ఆదేశించారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. సోమవారం రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ సమావేశం టి.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వ్యవసాయ కూలీల, ఉపాధి కూలీల, పేదల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘమన్నారు. రాష్ట్రంలో రైతాంగ ఉద్యమాలకు సంఘీభావం తెలుపుతూ వాళ్ల పోరాటాలకు సంపూర్ణ మద్దతిస్తూ, కార్మికుల ఐక్యతను చాటుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై చేస్తున్న పోరాటంలో తమవంతు మద్దతు తెలుపుతున్నామన్నారు. జంగారెడ్డిగూడెంలో జరిగే ఈ మహాసభ జయప్రదానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ ఆరో తేదీన పోలవరం నిర్వాసితులు, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు, కార్మిక కర్షక ఐక్యతను చాటే ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శన, పేదలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు.

ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, డ్వామా పీడీ డి.రాంబాబు హాజరవుతున్నారని తెలిపారు. డిసెంబర్ ఏడో తేదీన సాంస్కృతిక సమ్మేళనం ఉంటుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా అభ్యుదయ కవి గోరేటి వెంకన్న హాజరవుతున్నారని తెలిపారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపీ బృందాకరత్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్, రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, పి.కిషోర్, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, జివిఎల్ నరసింహారావు, మడివి దుర్గారావు, తుమ్మల సత్యనారాయణ, ఎస్‌కె.సుభాషిణి, ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

కల్లాల్లోని ధాన్యం తక్షణం కొనాలి

రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు నిరసన

ప్రజాశక్తి - దెందులూరు

ప్రస్తుత వర్షాల నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఉండ్రాజవరంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని సత్యనారాయణపురం, దెందులూరు, కొవ్వలి, పోతునూరు గ్రామాల్లో పర్యటించి కల్లాలోని ధాన్యాన్ని పరిశీలించారు. వాయుగుండం ఫలితంగా వర్షపు చినుకులు రావడంతో పరుగులు తీయాల్సి వస్తోందని రైతు సంఘం నాయకుల వద్ద రైతులు వాపోయారు.

ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందని చెప్పారు. రవాణా, హమాలీలు ఏర్పాటును రైతే చేసుకోవాలని చెప్పడంతో చేతిలో చిల్లిగవ్వలేని రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రవాణా, హమాలీల ఏర్పాట్లు ప్రభుత్వమే చూడాలని కోరారు. ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత ఏ మిల్లుకు తీసుకువెళ్లాలో అనే విషయాన్ని ఆలస్యంగా చెప్పడంతో లారీలు, ట్రాక్టర్ల యజమానులు ధాన్యం రవాణాకు ముందుకు రావడం లేదని చెప్పారు. 34 బస్తాల మించి ధాన్యం కొనుగోలు చేయలేమని కొనుగోలు పరిమితి పెట్టడం వల్ల 34 బస్తాలు మించి దిగుబడి వచ్చిందని మిగిలిన ధాన్యాన్ని ఏమి చేసుకోవాలని ప్రశ్నించారు. కొనుగోలు పరిమితి 40 బస్తాలకు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు గోనె సంచులు అందించాలని కోరారు. వాయుగుండం నేపథ్యంలో తేమశాతం నిబంధన సడలించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, రావాడ నాగిరెడ్డి, లంకా శ్రీనివాసరావు, బుగత తాతారావు, నల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులు ఆందోళన చెందొద్దు : జెసి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులకు ఇబ్బందులు లేకుండా రైతు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నామని జెసి పి.అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని వడాలిలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఆర్‌బికె, రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. రైతుల నుంచి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసుమిల్లులకు వెంటనే తరలించాలని సిబ్బందికి అదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలు ద్వారా కొనుగోలు చేసి రైసు మిల్లులకు తరలిస్తున్నారన్నారు. కల్లాల్లో ధాన్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆర్‌బికెలకు తరలించాలన్నారు. శీతాకాలం కావడంతో తేమశాతం ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా 20 తేమ శాతంపైగా ఉన్న ధాన్యాన్ని కూడ రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. తుపాన్ ప్రభావం వల్ల రైతులు కూడ పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలన్నారు. జిల్లాలో 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో ఉంగులూరు, దెందులూరు మండలాల్లో వరికోతలు పూర్తయ్యి మాసూళ్లు చేపట్టి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఆర్‌బికెల్లో ఆన్‌లైన్‌లో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్న కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతుల్లో కొంతమందికి నగదు వారి ఖాతలో జమ చేశామని చెప్పారు. వాతావరణం దృష్ట్యా రైతులు ఆందోళన చెందకుండా తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. ఆయన వెంట డ్వామా పీడీ రాంబాబు, తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఆర్ఐ కెవి.వెంకటేశ్వరావు, మండల వ్యవసాయాధికారి బొర్రా మాధవ్, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, విఆర్ఒ కారే కేశవ, మరీదు బాలదాస్ ఉన్నారు.

ఉంగుటూరు:ధాన్యం కొనుగోలు సజావుగా సాగుతుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏలూరు ఆర్‌డిఒ, ధాన్యం సేకరణ మండలం ప్రత్యేకాధికారి కె.పెంచల కిషోర్ స్పష్టం చేశారు. సోమవారం ఉంగుటూరు, ఎ.గోకవరంలో ఆర్‌డిఒ పెంచల కిషోర్ పర్యటించి ధాన్యం సేకరణ, రవాణా అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆదివారం వరకూ 10,088 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సోమవారం వంద లారీల ద్వారా సుమారు 2,500 టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించామని చెప్పారు.

మండవల్లి:రైతుల ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని జెసి అరుణ్ బాబు అన్నారు. మండలంలోని కానుకొల్లు కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. అల్లినగరంలో రైతులు ఆందోళన చేపట్టిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలన్నారు. వాతావరణ మార్పుల దృష్ట్యా తేమశాతం 17 కన్నా అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. 17 శాతం కన్నా ఎక్కువ ఉంటే క్వింటాల్‌కు కేజీ చొప్పున తగ్గించి కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

గణపవరం:మండలంలో ఇప్పటి వరకూ 1300 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించినట్లు జెడ్‌పి సిఇఒ, మండల కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారి కె.రవికుమార్ తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో రైతులను సోమవారం కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకూ ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో 1300 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించినట్లు చెప్పారు. సంచులు కొరత లేదన్నారు. ఆర్‌బికెల వద్ద 74,200 సంచులున్నట్లు చెప్పారు.

రాయపూడికి ఉపాధ్యాయ రత్న పురస్కారం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కుంతలగూడెం ఎంపియూపి స్కూల్ ఉపాధ్యాయులు రాయపూడి వెంకటరమణకు ఉపాధ్యాయ రత్న పురస్కారం దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య ద్వారా పురస్కారాన్ని అందుకున్నట్లు రాయపూడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 17వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రతిభను కనబరుస్తున్న 50 మందిని గుర్తించి ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.నందా పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాయపూడిని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యుటిఎఫ్ నాయకులు అభినందించారు.

ఆదర్శప్రాయులు భీమేశ్వరప్రసాద్

ఏలూరు ఎంఎల్ఎ ఆళ్లనాని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇద్దరు కుమారుల్లో ఒకరిని ఐఎఎస్‌గా, మరొకరిని ఐపిఎస్‌గా తీర్చిదిద్దిన విద్యుత్‌శాఖ ఉద్యోగి భీమేశ్వరప్రసాద్‌ను తల్లిదండ్రులు ఆదర్శంగా తీసుకోవాలని ఏలూరు ఎంఎల్ఎ, ఉప ముఖ్యమంత్రి ఆళ్లనాని అన్నారు. ఏలూరులో కాపు - తెలగా అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐపిఎస్‌కు ఎంపికైన రాఘిపాటి వసంతకుమార్‌ను సన్మానించారు. ఆయన తండ్రి రాఘిపాటి భీమేశ్వరప్రసాద్, కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు కుమారులను ఐఎఎస్, ఐపిఎస్‌గా తీర్చిదిద్దిన భీమేశ్వర ప్రసాద్ ఆదర్శప్రాయుడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా కాపు వన సమారాధన నిర్వహించడం వల్ల ఏలూరులోని కాపు కుటుంబాల మధ్య ఎంతో మంచి అనుబంధాలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ గుడిదేసి శ్రీనివాస్, రాష్ట్ర మెడికల్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ దిరిసాల వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి - టి.నరసాపురం

ద్విచక్రవాహనదారులు తలకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా సురక్షితంగా ప్రయాణం చేయవచ్చని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వాహనదారులకు సోమవారం హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికి ప్రమాదమన్నారు. వాహనాలపై ప్రమాదాలు జరిగినప్పుడు అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్ల మరణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. హెల్మెట్ ధరించండి సురక్షితంగా మీ గమ్యాన్ని చేరండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ద్విచక్రవాహనాలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జయబాబు చెప్పారు. బుట్టాయిగూడెంలోని పలు కూడళ్లలో వాహనదారులను ఆపి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలకు రక్షణగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం పోలీస్ సిబ్బంది చిట్టిబాబు, సుధీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని తెల్లంవారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిపి కారం శాంతి సోమవారం పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పాలు, గుడ్డు, భోజనం సక్రమంగా నాణ్యతగా అందించాలని చెప్పారు. తెల్లవారిగూడెం గ్రామ సచివాలయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

జీలుగుమిల్లి పిహెచ్‌సి వైద్యాధికారిగా గాయత్రి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గాయత్రి

జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండో వైద్యాధికారిణిగా బి.గాయత్రి నియామకం అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పిహెచ్‌సిలో ఇప్పటివరకు విధులు నిర్వహించిన డాక్టర్ భువనచంద్ర ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లిపోయారు. ఆమె స్థానంలో గాయత్రిని వైద్య ఉన్నతాధికారులు నియమించారు.

అన్యాక్రాంత అసైన్డ్ భూ సమస్య పరిష్కరిస్తాం

చాట్రాయి:మండలంలోని సి.గుడిపాడు గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు హామీ ఇచ్చారు. సి.గుడిపాడు పేదలు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.హరినాధ్, అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు ఆధ్వర్యంలో తహశీల్దార్ విశ్వనాధరావును సోమవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా డి.హరినాధ్ మాట్లాడుతూ సి.గుడిపాడులో ఆర్ఎస్ నెంబర్ 877/1, 877/3,877/4, 899లో సుమారు 17.50సెంట్ల భూమి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భరిణపాడు గ్రామానికి చెందిన సూరయ్య అనే వలస భూస్వామి పర్వాతాపురం గ్రామానికి చెందిన కొందరు బినామీ పేర్లతో అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. స్థానిక పేదలపైన, లిబరేషన్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించటమే కాకుండా తిరువూరు సివిల్ కోర్టులో దావా వేశారని, వారు వేసిన దావా పిటీషన్‌పై విచారించిన కోర్టు వారి వాదనలో నిజం లేదని కొట్టివేసిందని తహశీల్దార్‌కు వివరించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ ఇరు గ్రూపులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి : టిడిపి

ఉంగుటూరు:వాతావరణం మార్పులు, వాయుగుండం నేపథ్యంలో తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని టిడిపి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు డిమాండ్ చేశారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా సోమవారం గోపీనాథపట్నంలో పర్యటించారు. ధాన్యం రాసుల వద్ద రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఇంటింటా తిరిగి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొయ్యలగూడెం:వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పి.నాగమణి, మండల వ్యవసాయాధికారి ఎస్.చెన్నకేశవులు అన్నారు. సోమవారం మండలంలోని గవరవరం, చొప్పరమన్నగూడెం, పొంగుటూరు, ఎర్రంపేట గ్రామాల్లో రైతులకు వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు తమ పంటను జాగ్రత్తగా ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకూ కొయ్యలగూడెం మండలంలో 240 టన్నుల ధాన్యాన్ని సేకరించి వివిధ రైస్ మిల్లులకు పంపామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ రమేష్, ఆర్‌బికె అగ్రికల్చర్ అసిస్టెంట్ మౌనిక పాల్గొన్నారు.

దుర్గాప్రశాంతికి అండగా ఉంటాం : డిఎంహెచ్ఒ

కొయ్యలగూడెం:ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎఎన్ఎం పూలపల్లి దుర్గాప్రశాంతికి అండగా ఉంటామని డిఎంహెచ్ఒ రవి అన్నారు. సోమవారం కొయ్యలగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న దుర్గాప్రశాంతిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బోడిగూడెంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంతి రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లూ కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మహిళల సామాజిక భద్రతకు కమిటీలు

చాట్రాయి:మహిళల సామాజిక భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ టి.శేఖర్ అన్నారు. స్థానిక వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో మహిళలతో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఈ మేరకు మండలస్థాయిలో కమిటీలు వేస్తామన్నారు. ఈ కమిటీలు గ్రామ ఐక్య సంఘంలో ముగ్గురు మహిళా సభ్యులతో కూడిన కమిటీ మండల స్థాయిలో ముగ్గురు మహిళా సభ్యులతో కూడిన కమిటీ వేస్తామని, ఈ కమిటీలు మహిళల రక్షణ కోసం, వారి భద్రత కోసం నిరంతరం పనిచేస్తాయని చెప్పారు.

ఆయిల్‌పామ్‌కు మద్దతు ధర చెల్లించాలి

చితలపూడి :ఆయిల్‌పామ్ టన్నుకు రూ.20 వేలు మద్దతు ధర నిర్ణయించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి పట్టణంలో ఆయిల్‌పామ్ రైతుల సమావేశం ఎం.వసంతరావు అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కెవివి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పామాయిల్ ధర నిర్ణయించి రైతుల సమస్యలపై చర్చించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలని, కాలంచెల్లిన ఫ్యాక్టరీలను ఆధునీకరించాలని, పామాయిల్ మొక్కలను రైతులందరికీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మండవల్లిలో అక్రమ కట్టడాలు!

అనధికారంగా పరిశ్రమ నిర్మాణం
డ్రెయినేజీలో నీరు పోకుండా ర్యాంపు ఏర్పాటు
మాముళ్ల మత్తులో పంచాయతీ అధికారులు
మధ్యవర్తితో అక్రమార్కుల ఒప్పందం

అక్రమంగా డ్రెయినేజీపై నిర్మిస్తున్న ర్యాంప్

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లిలో అక్రమ కట్టడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు ముడుపుల మత్తులో అక్రమార్కులకు సహకరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అక్రమార్కులకు, పంచాయతీ అధికారులకు ఒక వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారని, ఆ వ్యక్తి అక్రమ కట్టడాలు గుట్టు చప్పుడు కాకుండా నిర్మించేలా సహకరిస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నాడని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనికి నిదర్శనంగా మండవల్లి స్టేషన్ రోడ్డులో అనుమతులు లేకుండా భారీ ర్యాంపు నిర్మాణమని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. మండల కేంద్రమైన మండవల్లిలోని మురుగు నీరంతా జాతీయ రహదారి వెంబడి ఉన్న బోది ద్వారా వెళ్లి రుద్రవరం వద్ద ఉన్న మురుగు కాలువలో కలుస్తుంది. ఆ ప్రాంతంలోనే వెంచర్‌లో కైకలూరుకు చెందిన ఓ వ్యాపారి స్థలం కొనుగోలు చేసి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బిస్కెట్లు, చెకోడీ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశాడు. ఆ పరిశ్రమకు వాహనాలు నేరుగా వచ్చేలా ర్యాంపును ఏర్పాటు చేసుకునే విధంగా మధ్యవర్తితో రూ.లక్షల్లో ఒప్పందం కుదుర్చుకుని పంచాయతీ అనుమతులు లేకుండా డ్రెయినేజీని ఆక్రమించి గుట్టుచప్పుడు కాకుండా ర్యాంపు నిర్మాణం పనులు ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ నిర్మాణ పనులను అడ్డుకోవడంతో మధ్యవర్తితో మాట్లాడే పనులు ప్రారంభించామని, ర్యాంపు పనులను అడ్డుకునే అధికారం మీకు ఎవరిచ్చారని పరిశ్రమదారుడు గ్రామస్తులపై ధ్వజమెత్తాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు మురుగునీరు పోకుండా డ్రెయినేజీలో ర్యాంపు నిర్మించుకోవడానికి అనుమతులు ఎవరిచ్చారని, పంచాయతీ వ్యవహారాల్లో మధ్యవర్తి ప్రమేయం ఏంటని అప్పటి కార్యదర్శిపై ధ్వజమెత్తారు. గ్రామస్తుల నుంచి వచ్చిన ఒత్తిడితో సభ నిర్వహించి ఆ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసేంతవరకు ర్యాంపు నిర్మాణాన్ని చేపట్టవద్దని తీర్మానించినట్లు స్థానికులు తెలిపారు. డ్రెయినేజీలో మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిర్మిస్తున్న ఈ ర్యాంపు వల్ల గతంలో కురిసిన వర్షాలకు మండవల్లి గ్రామం నీటమునిగిందని, మురుగునీరంతా ఇళ్లలోకి చేరుకుని దుర్వాసన వెదజల్లిందని గ్రామస్తులు వాపోతున్నారు. ర్యాంపు నిర్మాణంతో మురుగు నీరు పారే అవకాశం లేకపోవడంతో నెలల తరబడి జాతీయ రహదారులపై నిల్వ ఉండటంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చూసీచూడనట్లు వ్యవహరిస్తే క్షణాల్లో ర్యాంపు నిర్మాణం పూర్తి చేస్తానని, అందుకు సహకరించాలని కోరుతూ నిర్మాణదారుడు పంచాయతీ అధికారితో, మధ్యవర్తితో ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పరిశ్రమదారుడు పంచాయతీ తీర్మానాన్ని కూడా ధిక్కరిస్తూ భారీ ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసేశాడు. దీంతో గ్రామస్తులు కార్యదర్శితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని, సమాచారం అందించేందుకు పంచాయతీకి వెళ్లగా అక్కడ ఎవ్వరూ లేరని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు వివరించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలపై ఉక్కుపాదం మోపి పంచాయతీకి ఆదాయం సమకూర్చేలా చర్యలు చేపట్టాలని, పంచాయతీ భూములు, డ్రెయినేజీలు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని, సక్రమంగా మురుగుపరేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి తోటా శ్రీనివాస రావు ను వివరణ కోరగా ర్యాంపు నిర్మాణం చేపడుతున్నట్లు తనకు తెలియదన్నారు. పరిశీలించి పనులు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేతవరం విద్యార్థిని

ప్రజాశక్తి - టి.నరసాపురం

మధులావణ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ఫుడ్‌బాల్ పోటీలకు కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెనసగంటి మధు లావణ్య ఎంపికైనట్లు హెచ్‌ఎం గాదిరాజు రామరాజు తెలిపారు. స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మధు లావణ్యకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామరాజు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో మధులావణ్య ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మధు లావణ్యకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ జి.రమేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బర్రె రమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు పోటీల్లో 'ఎల్‌బిసి' విద్యార్థుల ప్రతిభ

బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏలూరులో జిల్లా గ్రంథాలయంలో, బాలల గ్రంథాలయంలో వివిధ పోటీలు నిర్వహించారు. స్థానిక పడమర వీధిలో ఉన్న లిటిల్ బడ్స్ స్కూల్ విద్యార్థులు అత్యధిక ప్రతిభను కనబర్చి రెండు గ్రంథాలయాల్లో బహుమతులు సాధించారు. క్విజ్ పోటీల్లో జ్ఞానేశ్వర్, ఎ.తేజశ్విని, మనోహర్ ప్రథమ బహుమతులు సాధించారు. చిత్రలేఖనంలో పి.అనిత, బి.గీతిక, బి.నవ్య ప్రథమ బహుమతులు సాధించారు. కన్సొలేషన్ వి.సాయిలోకేష్ సాధించాడు. రోహిత్‌దుర్గ తృతీయ స్థానంలో నిలిచాడు. వ్యాసరచన పోటీల్లో కెపిఎస్.నాగేంద్ర తృతీయ, ఎస్.సత్యరోహిత్ కన్సొలేషన్ బహుమతులు సాధించారు. చెస్‌పోటీల్లో బి.గుణశేఖర్, జానపదనృత్యంలో కె.మౌనిక, వి.మాన్యత ద్వితీయ బహుమతులు సాధించారు. పద్యపఠనంలో పి.నవ్య ద్వితీయస్థానం, డి.నవ్య తృతీయస్థానంలో బహుమతులు అందుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్స్ వైఆర్.కిషోర్, ఎం.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, ఎం.కుమార్ అభినందించారు.

గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రముఖులు

గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు సిఐ వి.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అభివద్ధి కమిటీ ఛైర్మన్ టివి.ఉమామహేశ్వరరావు కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమడోలు సిఐ పాల్గొని ప్రసంగించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన 150 మందికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్ సొసైటీ తరపున వివిధ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు గ్రంథాలయానికి మైక్‌సెట్ అందించారన్నారు. స్థానిక సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయ సారథి గ్రంథాలయానికి వచ్చే వారికి కనీస సౌకర్యాల కల్పనకు హామీ ఇచ్చారని తెలిపారు. మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు భీమడోలు సర్పంచి పి.సునీత మాన్‌సింగ్ గ్రంథాలయ నిర్మాణానికి గ్రామపంచాయతీ సర్పంచి స్థలం కేటాయింపునకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు టి.భవానీరంగా, ఎఎంసి ఛైర్ పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్ ఎంపిడిఒ రాఘవన్ పాల్గొన్నారు.

పశువైద్యశాలలో మందుల కొరత

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పశువైద్యశాలలో మందుల కొరతతో పాడిరైతులు నానాఅవస్థలు పడుతున్నారు. మండవల్లి గ్రామానికి కోనపురెడ్డి సత్య నారాయణకు చెందిన గేదెకు పొదుగులోని రొమ్ముకు సమస్య ఏర్పడటంతో సోమవారం పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యులు పరిశీలించి దీనికి సంబంధించిన మందులు వైద్యశాలలో లేవని, బయట నుండి తెచ్చుకోవాలని చెప్పడంతో ఆ రైతు అవాక్కయ్యాడు. మందుల షాపు వద్దకు వెళ్లగా వెయ్యి రూపాయలు ఖర్చు చేసి మందులు తీసుకొచ్చానని ఆ రైతు వాపోయాడు. పశువులకు ఏ చిన్న సమస్య వచ్చినా వైద్యం అందించడానికి ప్రయివేటు మందుల షాపులను ఆశ్రయించాల్సి వస్తుందని, మందులు అందుబాటులో లేవని వైద్యులు చెబుతున్నారని వివరించాడు. మందు లు అందుబాటులో లేకపోవడం పై పశుపోషకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. దీనిపై ఎడిఎ వరప్రసాద్‌ను వివరణ కోరగా కొన్ని మందులు ఆసుపత్రిలో లేవని, ఉన్నతాధికారులకు తెలియజేసి మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆశీల వసూలు ఆపాలి : సిఐటియు

జంగారెడ్డిగూడెం:ఆటోలపై అశీల వసూలు అరికట్టాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆటో వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేసే కాంట్రాక్టర్ ట్రక్కు ఆటో వర్కర్స్ వద్ద ఆసీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. జిఒ నెంబర్ 21 ప్రకారం స్థానికంగా ఉన్నవారు వేరే ప్రదేశానికి వెళ్లినప్పుడు మాత్రమే ఆశీలు కడతారని అలాగే ఇతర ప్రాంతం వారు స్థానిక మున్సిపాలిటీకి వచ్చినప్పుడు ఆశీలు చెల్లిస్తారని చెప్పారు. కానీ ఎన్నడూ లేని విధంగా స్థానిక ఆటోలపై ఆశీలు వసూలు చేయడం దారుణమని వాపోయారు. దీనిపై ఆశీలు వసూలు చేసే కాంట్రాక్టర్‌ని నిలదీస్తే మున్సిపల్ అధికారుల సూచన మేరకు స్థానిక ఆటోలపై ఆసీలు వసూలు చేస్తున్నామని బదులివ్వడం అనుమానాలకు దారి తీస్తుందని తెలిపారు. అనంతరం స్పందనలో ఎఒ ఎం.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు బి.నాని, డి.ఆశీర్వాదం, సునీల్ రాంబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి

బుట్టాయగూడెం : పోగొండ రిజర్వాయర్‌లో చేప పిల్లలను ఫిషరీస్ ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ బి.నరసయ్య సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో ఇప్పటివరకూ మూడు దఫాలుగా చేప పిల్లలను విడుదల చేశామన్నారు. ఈ దఫా రెండు లక్షల చేప పిల్లలను వదిలినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, ఎంపిటిసి సవలం కోటేశ్వరరావు, మంగయ్యపాలెం సర్పంచి వెంకన్నబాబు, నిమ్మలగూడెం సర్పంచి బుచ్చిరాజు పాల్గొన్నారు.

చింతలపూడి:మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందిస్తుందని, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి.ఈశ్వర్‌చంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు జలాశయంలోకి చేపపిల్లలను వదిలారు. తమ్మిలేరు, బుట్టాయగూడెం మండలం జల్లేరు, పోగొండ రిజర్వాయర్లలో ఐదు లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జంగారెడ్డిగూడెం:స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని ట్రైనీ అసిస్టెంట్ జిల్లా కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో జనరల్ వార్డు, ల్యాబ్, బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. రోగులకు వైద్యం అందిస్తున్న సిబ్బందిని పలువివరాలు అడిగి తెలుసుకున్నారు. ఔషధాల వినియోగం, నిల్వ వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అపరిశుభ్రతే వ్యాధులకు మూలం

దెందులూరు:అపరిశుభ్ర పరిసరాలే అంటువ్యాధులకు మూలమని, ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గోపన్నపాలెం సర్పంచి నాగమల్లేశ్వరి కుమార్‌బాబు సూచించారు. గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మసీదుపాడులో వైద్య సిబ్బంది చేస్తున్న ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని సర్పంచి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు పెరిగి డెంగీ, మలేరియా వంటి జ్వరాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజలు వారానికి ఒకసారి మంచినీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ఎయిర్ కూలర్స్, ఫ్రిడ్జ్ వెనుక బాక్స్ శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఏలూరు అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు మాట్లాడుతూ డెంగీ, మలేరియా కారక దోమలు కేవలం గృహాల్లో పెరుగుతాయన్నారు. అనంతరం ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి మురుగు కాలువలపై ఎబెట్ ద్రావణం పిచికారీ చేశారు. గృహాల్లో దోమ ముందు చల్లారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రోజా లలిత, నాగరాజు, నాగేశ్వరమ్మ, బేబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'శెట్టి బలిజల శాసనాధికారమే లక్ష్యం'

ప్రజాశక్తి - కలిదిండి

శెట్టి బలిజకు శాసనాధికారమే లక్ష్యంగా సంఘటితం కావాలని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు కుడిపూడి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మూలలంకలో నియోజకవర్గ స్థాయి శెట్టి బలిజ సంఘ వన సమారాధన సోమవారం నిర్వహించారు. రాష్ట్ర జనాభాలో ఆరు శాతం జనాభా కలిగిన శెట్టి బలిజకు అదే స్థాయిలో గుర్తింపు లేదన్నారు. 2024 ఎన్నికల్లో పది మందికి పైగా శెట్టి బలిజ కులస్తులను శాసనసభకు పంపేలా ప్రయత్నాలు చేస్తున్నామని సూర్యనారాయణ అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించినప్పుడే పూర్తిస్థాయి గుర్తింపు వస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కంశెట్టి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల అధ్యక్షులు కోడె దుర్గారావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, నాయకులు బండి తులసీరావు, మామిడిశెట్టి నాగముని, మాజీ ఎంపిపి బి.లక్ష్మి, మాజీ సర్పంచి చింతపల్లి చంద్రరావు, కడలి శ్రీనివాసరావు, తంగెళ్ల గణపతి ప్రసాద్, నియోజక వర్గ స్థాయి శెట్టి బలిజ కులస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డిప్పకాయలపాడు గ్రామానికి చెందిన బూరుగుపల్లి శ్రీను(46) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తమ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై గోపాలపురం వెళ్లాడు. తిరిగివస్తుండగా మార్గమధ్యలో స్థానిక పొగాకు వేలం కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బావమరిది సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జిజె.విష్ణువర్ధన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్రామం యూనిట్‌గా నష్టపరిహారం

ప్రజాశక్తి - ముసునూరు

అతివృష్టి, అనావృష్టి కారణాలతో వరి పంట దిగుబడి తగ్గినప్పుడు ప్రభుత్వం నుండి అందే నష్ట పరిహారం గ్రామం యూనిట్‌గా అందించాలనే ఉద్దేశంతో వరి పంటలో సీసీ విధానం పరిశీలిస్తున్నట్లు ముసునూరు తహశీల్దార్ దాసరి సుధ అన్నారు.సోమవారం మండలంలోని కోర్లగుంట గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె.చిన సూరిబాబు ఆధ్వర్యంలో వరి పంట సీసీ విధానం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ సూరిబాబు మాట్లాడుతూ గతంలో మండలం యూనిట్‌గా ఉన్నప్పుడు ఒక గ్రామంలో నష్టం వచ్చినా, ఆ పక్కగ్రామంలో నష్టం రాకపోతే రైతులకు పరిహారం అందేది, కాదని ప్రస్తుతం గ్రామం యూనిట్‌గా సీసీ విధానం చేయడం వల్లన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎంపిఇఒలతో పాటు రైతులు కుడా ఉన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట గ్రామ కాపురస్తురాలు మైన వేల్పూరి సోమరాజు, తండ్రి: వెంకటేష్ అనే నాకు గల పాస్‌పోర్టు నెంబరు **H 8185344** గత నెల 26-10-2022న ఉంగుటూరు నుండి తాడేపల్లిగూడెం ఆటోలో వెళ్తుండగా పాస్‌పోర్టు కలిగిన కవర్ మార్గ మధ్యలో పడిపోయింది. కావున దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వేల్పూరి సోమరాజు
S/o. వెంకటేష్, హౌస్ నం. 13-299/1
నాచుగుంట, ఉంగుటూరు
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-పిన్:534411
సెల్: 9951012533

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన **శ్రీ సింహాద్రి నరసింహారావు, S/o. రామలింగేశ్వరరావు** కారిచర్లవారి వీధి, తూర్పు వీధి, ఏలూరు - 534001 అను వారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పాలూరి రవీంద్ర జైపాల్, S/o. లేటు వెంకట్రావు, వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర, పడమర వీధి, ఏలూరు అను వారి దగ్గర నుండి కొనుగోలు చేయుటకు సిద్ధపడినారు. సదరు ఆస్తి కొనుగోలు విషయములో ఎటువంటి లావాదేవీలు ఉన్న ఎడల నా యొక్క దిగువ అడ్రసుకు సంప్రదించవలసినదిగా కోరుచున్నాను. సదరు కొనుగోలు జరిగిన తరువాత ఎటువంటి లావాదేవీలకు నా క్లయింటు బాధ్యుడు కాదు అని ఈ పత్రిక ముఖముగా తెలియజేయుచున్నాను.

షెడ్యూలు ఆస్తి వివరం

ఏలూరు జిల్లా, ఏలూరు సబు.డి., పాత పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు కార్పొరేషన్, పడమర వీధి, ఎ/2వ వార్డు, ఇప్పటి 17వ డివిజన్‌లోని T.S. No. 1345 దాఖలా తాలూకు చ॥గ॥ 79.13/16 ములు లేక 67 చ॥మీ॥ల స్థలము, అందులోని డోరు నెంబరు 3బి-5-9రు అసెస్‌మెంటు నెం. 1075032302 రుగా గల ఆర్‌సిసి బిల్డింగు వగైరా ఆస్తికి హద్దులు.
తూర్పు: రాజవీధి (మునిసిపల్ రోడ్డు) అ. 23.9లు.
దక్షిణం: రవీంద్ర జైపాల్ స్థలము అ. 32.3లు.
పడమర: రవీంద్ర జైపాల్ స్థలము అ. 21.0లు.
ఉత్తరం: రాజవీధి (మునిసిపల్ రోడ్డు) 63.0లు.

శ్రీ అంబుల వెంకట నారాయణ
న్యాయవాది, అగ్రిగోల్డ్ అపార్టుమెంటు సందు
ఏలూరు పత్తేబాద, ఏలూరు
తేది:21-11-22 సెల్: 9848422155

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 928/2022, O.S. 472/2022

Between:
పిటీషనరు/వాది: అడ్డాల నాగేశ్వరరావు
AND
రెస్పాండెంట్/ప్రతివాది: జయవరపు సుబ్రమణ్యం, హిందు, పురుషుడు, 34 సం॥లు, వ్యాపారం, S/o. సత్యసాయిబాబ, డో.నెం. 4-57/1, వినాయక గుడి వద్ద, సిద్ధాంతం, పెనుగొండ మండలం, W.G.Dist., (AP), TDMC.

పిటీషనరు/వాది తరపు దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంధము **ది. 16-12-2022వ తేదీ వాయిదా అయి వున్నది.** సదరు గ్రంధములో రెస్పాండెంట్/ప్రతివాదికి I.A. 928/2022 మరియు దావాలోను ఎన్నిసార్లు నోటీసు సమన్లు పంపినప్పటికి రెస్పాండెంట్/ ప్రతివాది సదరు నోటీసు దావా సమను తీసుకోకుండ Avoid అగుచున్నందున పై పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది. సదరు తేదీన రెస్పాండెంట్/ ప్రతివాది స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలసి వున్నది. లేని ఎడల మీపై పరోక్షముగా తీర్మానించబడును అని యిందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
తణుకు అడ్వకేట్, తణుకు
ది.21-11-2022 సెల్: 7013318947

పబ్లిక్ నోటీసు
In the Court of the Senior Civil Judge at Kaikalur
H.M.O.P. No. 91/2021

Between:
Baswani Ramesh ...*Petitioner*
AND
Baswani Lakshmi ...*Respondent*
To:
Baswani Lakshmi, W/o. Ramesh, D/o. Revu Arjuna Rao, R/o. Kondangi Pallipalem Village of Kalidindi Mandal, Eluru District, Kaikalur PJCJC.

పై నెంబరు పిటీషన్‌ను పిటీషనరు రెస్పాండెంటుపై విడాకుల నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో శ్రీ కోర్టు వారి నుండి ఎన్నిసార్లు పిటీషన్ నోటీసులు పంపిననూ రెస్పాండెంటు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలుకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు **ది. 21-12-2022వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు నందు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది: 21-12-2022

శ్రీ పి.పవన్‌కాంత్
పిటీషనరు తరుపు న్యాయవాది
సెల్: 9490339161

వేలం ప్రకటన
మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
ఇ.పి. నెం. 29/2021
ఇన్
ఓ.ఎస్. నెం. 115/2016

బిట్వీన్:
శ్రీ తానాటి రమేష్ **-డిక్రీ హోల్డర్/వాది**
అండ్
శ్రీమతి పులి ధనలక్ష్మి
-జడ్జిమెంట్ డెటార్/ ప్రతివాది

పై నెంబరు గ్రంధములో డిక్రీ హోల్డర్, డిక్రీ బాకీ వసూలు నిమిత్తం, ఈ క్రింది ఉదహరించిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తి జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల స్థిరాస్తి అయి వున్నది. ఈ స్థిరాస్తిని కోర్టు వారు **ది. 16-12-2022వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై ఉదహరించిన కోర్టులో బహిరంగ వేలం వేయుదురు. కాబట్టి యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును.

షెడ్యూలు ఆస్తి వివరము

పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబు.డి., ఏలూరు మండలం, జాలిపూడి గ్రామపంచాయతి, జాలిపూడి గ్రామంలోని జిరాయితి పల్లం ఆర్.యస్. నెం. 294/1రు య. 0-63 సెంట్లు అనగా 0.255 హెక్టార్ల భూమికి హద్దులు.
తూర్పు: పులి నాగేశ్వరరావు వగైరాల భూమిలో నుండి వెళ్ళు కాలువ. **దక్షిణం:** గోగు వీరభద్రరావు గారి భూమి. **పడమర:** పులి శ్రీనివాసరావు గారి భూమి. **ఉత్తరం:** పంట బోదె.
ఈ హద్దుల మధ్య య. 0.63 భూమిని వేలం వేయుదురు.
డి. హెచ్. ఆర్. విలువ: రూ. 12,00,000=00
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

టి.జగన్‌మోహన్, అడ్వకేట్
ఏలూరు, సెల్: 8247533188